కాప్-29 పెట్టుబడిదారీ విధాన వాతావరణ విన్యాసాల కొనసాగింపు

"చరిత్ర దానికదే పునరావృతమౌతుంది; ఒకసారి విషాదంగా.... రెండవసారి ప్రహసనంగా" అని ఒక సందర్భంలో కార్ల్‌మార్క్స్ ఎత్తిచూపాడు. ఐక్యరాజ్య సమితి ఆధ్వర్యంలో కాప్-29 పేరుతో నిర్వహించిన వాతావరణ మార్పుపై సదస్సులు ఇప్పటికే 28 పర్యాయాలు ప్రహసనంగా సాగటాన్ని మనం చూశాం. భద్రతాయుతమైన భవిష్యత్తుకు ప్రాధమికంగా అననుకూలమైన పెట్టుబడిదారీ వ్యవస్థ చట్రంలో వాతావరణ సంక్షోభ పరిష్కార ప్రయత్నాలు ఫలించబోవని ఇది స్పష్టం చేస్తోంది.

"ఈ సమావేశాలు, సదస్సులన్నీ ప్రజల జీవనానికి అనుకూలమైన సురక్షిత భవిష్యత్తును, ప్రపంచాన్ని గ్యారంటీ చేయటానికి వారు తీసుకునే లక్ష్యాలు, నిర్ణయాలన్నీ ఆయా దేశాల వైఫల్యాలకు చట్టబద్ధతను కల్పించేవే"నని వాతావరణ కార్యకర్త గ్రెటా ధన్‌బర్గ్ వర్ణించారు. అర్థవంతమైన పరిష్కారాలకు ఆమడదూరంలో నిలిచిన ప్రపంచ నాయకుల, కార్పొరేట్ లాబీదారుల ప్రజా సంబంధాల కసరత్తులకు 'కాప్' సమావేశాలు వేదికలుగా మారాయి. వారి నిరాశాజనక చర్యలు ఇలావుండగా, ప్రతి సం॥ జరిగే ఈ సభలు, సమావేశాలు మరింత దిగజారే విధానాలవైపు పయనిస్తున్నాయి.

ప్రముఖ 'పెట్రో' నగర ఆతిథ్యం

చమురు, సహజవాయువుల ఎగుమతులు 90 శాతంగావున్న అజర్ బైజాన్‌లోని 'బకు' నగరం, కాప్-29 సమావేశాలకు ఆతిథ్య మిచ్చింది. గత సంవత్సరం కూడా శిలాజ ఇంధన ప్రమఖ ఎగుమతి దేశమైన యుఏఇలోని పెట్రోనగరంలోనే ఈ సమావేశాలు జరుగగా, ఇప్పుడు మరొక ప్రముఖ పెట్రోనగరంలో ఈ సమావేశాలు జరిగాయి. అజర్ బైజాన్ అధ్యక్షుడు శిలాజఇంధనాలు 'దేవునికానుకలు'గా బాహాటంగా పేర్కొన్నాడు. పర్యావరణ కార్యకర్తలను అణచి వేస్తున్నదానికి ఒక ముసుగుగా ఈ సమావేశాలను ప్రభుత్వం ఉపయోగించిందని ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ సంస్థ ఆరోపించింది.

ఆచరణకు పొంతన లేని ఈ విధానాలతో పాటుగా ఈ సారి సదస్సును 'కాప్-29 : వాతావరణం, శాంతి' అనే ఇతివృత్తంతో రూపొందించారు. ఏమైనా, ఇజ్రాయిల్‌కు అవసరమైన చమురు దిగుమతుల్లో 40 శాతం సరఫరాదారుగా వుండి, ప్రపంచ ఆయుధ విపణిలో తన కాంక్షలతో వ్యవహరిస్తున్న అజర్‌బైజాన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సదస్సు శీర్షికతో పూర్తిగా విబేధిస్తోంది. చమురు, సహజవాయువు వ్యాపారాలతో, యుద్ధాల నుండి లాభాలార్జించే ప్రభుత్వ ఆధ్వర్యంలో 'శాంతి కోసం పర్యావరణ సదస్సు'గా పేర్కొనబడే దానిని, ప్రపంచవ్యాపితంగా కర్బన ఉద్గారాలు అనంతంగా కొనసాగుతుండగా నిర్వహించారు.

కాప్-29 చుట్టుముట్టివున్న అవినీతి అనే విస్తృత సమస్యకు సూచనాత్మక వ్యక్తీకరణే, చమురు సహజవాయువుల ఉత్పత్తులను పెంచుకునేందుకు అజర్ బైజాన్ యొక్క నిరంతరాయ చర్యలుగా వీడియోకి చిక్కి, వెల్లడయ్యాయి. ఈ సమావేశాలకు అధ్యక్షతవహించిన ఇంధనశాఖ ఉపమంత్రి ఎల్నర్ సోల్టనోవ్ చేసిన చర్యలు దీనిని వెల్లడి చేస్తున్నాయి. ఇదిలా వుండగా, శిలాజ ఇంధన లాబీదారులు, వివిధ దేశాల నుండి హాజరైన ప్రతినిధుల సంఖ్యలో అధికులుగా వుండి, వాతావరణ విధానంపై తమ ప్రభావాన్ని నెరిపేందుకు కలుషితదారులంతా కలిసికట్టుగా సాగించిన ఒక జాతరగా ఈ సదస్సును మార్చివేశారు.

శుష్క వాగ్దానాలు, శూన్యచర్యలు

"నూతన వాతావరణ ఆర్థిక ఒప్పందం" అనేది కాప్-29లో ప్రతిపాదించబడిన ఒకానొక పెద్ద అంశం. వాతావరణ మార్పు ప్రభావాలను తట్టుకునేందుకు పేదదేశాలకు సంపన్న దేశాల నుండి నిధులు పొందటానికి ఇది ఉద్దేశించ బడింది. ఏమైనా, భారీ కలుషితదారులైన దేశాల నుండి, శిలాజ ఇంధన వాడకం తగ్గింపు గురించి ఎలాంటి అంగీకారం రాకపోవటం, వారి వాగ్దానాల డొల్లతనాన్ని స్పష్టం చేస్తోంది. పెద్ద మంటల్లో చిక్కుకున్న వారికి చుక్క నీరందించడం లాంటిదే ఇది.

గత మూడు దశాబ్దాలుగా ఈ సభలు, సమావేశాలు, వాస్తవిక పురోగమనం సాధించటంలో విఫలమయ్యాయి. ప్యారిస్ ఒప్పందం విధించిన పరిమితులకంటే చాలా అదనంగా, భూగోళం 2 నుండి 3 డిగ్రీల సెల్సియస్‌కు వేడెక్కుతున్న దిశలో

వుంది. ఈ పరిస్థితి భారీ విపత్తులకు, అతి తీవ్ర వాతావరణ ఘటనలకు, సముద్ర మట్టం పెరుగుదలకు, పర్యావరణ వ్యవస్థ కుప్పకూలేందుకు దోహదపడుతుంది.

'కాప్' మొత్తాన్ని మరమ్మత్తు చేయవలసిందిగా ప్రఖ్యాత వాతావరణ శాస్త్రవేత్తలు ఇటీవల ఐక్యరాజ్య సమితికి పిలుపునిస్తూ, ప్రయోజనానికి ఇది ఏ మాత్రం సరితూగేదికాదు అని పేర్కొన్నారు. భవిష్యత్తులో జరిగే 'కాప్' సమావేశాలను వాతావరణ మార్పుల కట్టడికి నిజాయితీగా నిలిచే దేశాలలో నిర్వహించవలసిందిగా వారు సూచించారు. అయితే ఈ సంస్కరణాత్మక సూచనలు కూడా, సమస్య లోతులలోకి వెళ్ళి పరిష్కరించేందుకు ఏమాత్రం దోహదపడవు. భూగోళాన్ని వినాశనానికి గురిచేసైనా సరే, తను లాభాలను నిరంతరాయంగా పొందాలనే పెట్టుబడిదారీ వ్యవస్థ దీనికి మూలకారణం.

పెట్టుబడిదారీ వ్యవస్థ సంక్షోభం

ప్రపంచ పెట్టుబడిదారీ సంక్షోభం, యాదృచ్ఛికమైనది కాదు; దీర్ఘకాలిక మనుగడను పణంగా పెట్టి కొద్ది కాలంలోనే లాభాలు పిండుకోవటానికి ప్రాధాన్యతనిచ్చే వ్యవస్థ యొక్క అనివార్య దుష్ఫలితాలే ఇవన్నీ. వారి గంభీర, పదాడంబర వాగ్దానాలు కొనసాగుతూనే వుంటాయి. కానీ వారి ప్రభుత్వాలు ఎన్నటికీ మనస్ఫూర్తిగా – భూగోళం మండిపోతున్నప్పటికీ – శిలాజ ఇంధనాలను నిషేధించబోవు.

'కాప్–29' యొక్క ప్రహసనాత్మక కార్యక్రమాలు గమనిస్తే, మనకు అవసరమైన పరిష్కారాలు పై నుండి రావని మనకు గట్టిగా గుర్తుచేస్తున్నాయి. తద్భిన్నంగా స్ఫూర్తి పొందేందుకు మనం చరిత్రలోకి తిరిగిచూద్దాం. ఒక శతాబ్దం క్రితం, 'బకు'లో నిర్వహించిన చాలా విభిన్నమైన 'సభ'లో విప్లవనాయకుడు గ్రిగొరి జినోవివ్ మాట్లాడుతూ అన్ని భూభాగాలలో కార్మికులు, ప్రపంచవ్యాపిత పీడిత ప్రజానీకమంతా పెట్టుబడిదారీ వ్యవస్థ అనాగరికత్వానికి వ్యతిరేకంగా ఐక్యం కావలిసిందిగా పిలుపునిచ్చాడు.

భవిష్యత్తును పునరుద్ధరించాలి

వాతావరణ సంక్షోభాన్ని పరిష్కరించేందుకు, అంతర్జాతీయ సంఘీభావం సమీకరించాలి; విప్లవశక్తుల స్ఫూర్తిని మనం తిరిగిపొందాలి. పెట్టుబడిదారీ వ్యవస్థకు వ్యతిరేకంగా సాగించే పోరాటం నుండి, వాతావరణ మార్పులకు వ్యతిరేకంగా సాగించే పోరాటం విడివడినదికాదు. భూగోళాన్ని, ప్రపంచ మానవ జాతి మనుగడను బలిపెడుతూ, పిడికెడు మంది యొక్క లాభాలకు ప్రాధాన్యతనిచ్చే వ్యవస్థను కూలదోయాలని పరిస్థితి సూచిస్తోంది.

ప్రకృతివనరులపై ప్రజల యాజమాన్యం, పునరుత్పాదక ఇంధనం వైపు వేగంగా మారటం, మానవ అవసరాలకు అనుగుణంగా నిర్వహించబడే ప్రైవేటు ప్రయోజనాలు లేని ఆర్థిక వ్యవస్థ మొదలైన డిమాండ్లతో కార్మికులను, కార్యకర్తలను, పీడిత ప్రజానీకాన్ని ఐక్యం చేసే ఒక ప్రపంచస్థాయి ఉద్యమం యొక్క అవసరం వుంది. అప్పుడు మాత్రమే మనం ఘోర విపత్తును ప్రక్కకు తప్పించి, నిలకడైన భవిష్యత్తును పునర్ నిర్మించుకోగలుగుతాము.

కాప్–29 సందేశం స్పష్టంగా వుంది. వాతావరణ సంక్షోభాన్ని పరిష్కరించే సామర్థ్యం పెట్టుబడిదారీ వ్యవస్థకు లేదు. అది మనల్నందరినీ కబళించేలోపే మేల్కొని, దానిని రూపుమాపే సమయమిదే.

(2024 డిశంబర్ 'క్లాస్ స్ట్రగుల్' నుండి అనువాదం)

****